# దేవుని గొప్పనీతి
## (రోమీయులకు వ్రాసిన పత్రిక సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** అనాది కాలం నుండి, దేవుడు మానవులకు నానావిధాలుగా తనను గూర్చిన ప్రత్యక్షతను అనుగ్రహించాడు. క్రొత్త నిబంధనలో పౌలు వ్రాసిన పత్రికలలో మనకు దేవుని గూర్చి సరిక్రొత్త ప్రత్యక్షత ఇవ్వబడింది. పలు సంఘాలకు వ్రాయబడిన ఈ పత్రికల ద్వారా ప్రభువు మనతో నిత్యం మాట్లాడుతూ ఉన్నాడు. రోమా పత్రిక యావత్ మానవాళికి, దేవుని రక్షణ సువార్తను ఆయన మహత్తర ప్రణాళికను తెలియజేస్తుంది.

**1. గ్రంథకర్త :** అపొస్తలుడైన పౌలు. ఇతడు తార్సు పట్టణానికి చెందిన నిష్ఠగల యూదుడు. పరిసయ్యుల బోధకుడైన గమలీయేలు వద్ద శిక్షణ పొందాడు. యూదులందరిలాగే వృత్తి విద్యను, అనగా డేరాలు కుట్టడం నేర్చుకున్నాడు. యెరూషలేములో, మొదటి హత సాక్షియైన స్తెఫెను రాళ్ళతో కొట్టబడి చంపబడినప్పుడు పౌలు అక్కడ ఉన్నాడు. ఈ దృశ్యం అతనిపై గొప్ప ప్రభావాన్ని చూపించినదనుటలో ఏ సందేహం లేదు. క్రైస్తవులను హింసించేందుకు దమస్కు మార్గంలో వెళ్తున్న ఈ యౌవనస్తున్ని యేసుక్రీస్తు సంధించాడు.

**2. రోమా పట్టణంలో సంఘం :** రోమాలో సంఘాన్ని ఎవరు స్థాపించారో తెలియదు. పేతురు యూదుల మధ్యనే పరిచర్య చేసాడు. రోమా పట్టణం నుండి యెరూషలేముకు వచ్చి పెంతెకొస్తు దినాన రక్షించబడిన కొందరు సువార్త బీజాలను తీసికొని వెళ్ళి ఆ పట్టణంలో నాటారు. అలా రోమా పట్టణంలో ఒక ఆరాధనా కేంద్రం ప్రారంభించబడింది. తరువాత 28 సంll ల కాలంలో తూర్పు ప్రాంతాల నుండి అనేకులు రోమా పట్టణానికి వెళ్ళి స్థిరపడ్డారు. వారిలో పౌలు ద్వారా మారుమనస్సు పొందినవారు కూడ ఉన్నారు.

ఈ సంఘాన్ని దర్శించాలన్న ఆసక్తితో, పౌలు, కొరింథు పట్టణంలో గాయి అనే క్రైస్తవుని గృహంలో నుండి ఈ పత్రికను వ్రాసాడు.

**3. పత్రిక రచనకాలం :** అపొస్తలుడైన పౌలు, మూడవ సౌవార్తిక యాత్ర చివరలో ఈ పత్రికను వ్రాసాడు. రోమా చక్రవర్తియైన నీరో పరిపాలనలో 4వ సంవత్సరం అనగా క్రీ.శ. 57 సంll వ్రాయబడిన ఈ పత్రికను ఫీబే అనే పరిచారకురాలి ద్వారా కొరింథు నుండి పంపించాడని రోమా 16:1,2 ను బట్టి చెప్పవచ్చును.

**4. పత్రిక విశిష్టత :** దేవుని నీతిని గూర్చి వివరించే ఈ గొప్ప పత్రికను వివరించడం కొంతకష్టమే. మనిషి పతనావస్థను, దేవుడు మనిషి కొరకు ఏర్పాటు చేసిన రక్షణ మార్గాన్ని ఈ పత్రిక వివరిస్తుంది.

క్రొత్త నిబంధనలోని నాలుగు సువార్తలు యేసు బోధలను కార్యాలను తెలియజేస్తాయి. కాని రోమీయులకు వ్రాసిన పత్రికలో ఆయన త్యాగ సహిత మరణం యొక్క గుర్తింపును గూర్చిన పరిశోధన కనిపిస్తుంది.

ప్రశ్నలు, జవాబుల రూపంలో పౌలు బైబిలు సిద్ధాంతాన్ని క్రమబద్ధంగా వివరించాడు. రోమా పత్రిక దేవశాస్త్రమునకు సంబంధించిన పుస్తకం కంటె గొప్పది. అది ఆచరణాత్మకమైన ఉద్బోధన.

ఈ పత్రికలో నిక్షిప్తమైయున్న రక్షణ జ్ఞానాన్ని బట్టి ఈ పత్రిక క్రొత్తనిబంధనంతటిలో అగ్రస్థానం వహించిందని మార్టిన్ లూథర్ వర్ణించాడు. అంతమాత్రమే కాదు సంఘ సంస్కరణలో అతడు రోమా 1:17 లోని సూత్రాన్నే ఆధారంగా తీసికొన్నాడు.

5. **రోమా పత్రికలో క్రీస్తు :** విశ్వసించిన వారందరు ఎవరి మరణం ద్వారా నీతిమంతులుగా తీర్చబడతారో ఆ క్రీస్తును ఆయనను రెండవ ఆదాముగా పౌలు ఈ పత్రికలో వర్ణించాడు.
6. **మూల వాక్యాలు :** "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివారికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ, రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది. ఎందుకనిన – నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది (రోమా 1:16,17)"

## B. పత్రిక విభజన :

### I. సిద్ధాంతపరమైన భాగము (విశ్వాసము) 1-8 అధ్యా :

**A. పాపి నీతిమంతునిగా తీర్చబడుట 1:1-5:11**

**అ. ఉపోద్ఘాతం - 1:1-17**

| | |
|---|---|
| ఎ) పౌలు వ్యక్తిగత శుభములు | 1:1-7 |
| బి) పౌలు వ్యక్తిగత ఉద్దేశం | 1:8-13 |
| సి) పౌలు తనను గూర్చి చెప్పిన మూడు విషయాలు | 1:14-17 |

**ఆ) మానవుని పాప ప్రత్యక్షత 1:18-3:20**

| | |
|---|---|
| ఎ) మనిషి పాపమును బట్టి దేవుని ఉగ్రత బయలుపర్చబడుట | 1:18-32. |
| 1) దేవుని సాధారణ ప్రత్యక్షత | 1:18-20 |
| 2) మనిషి అస్వాభావిక ప్రతిస్పందన | 1:24-27 |
| 3) సహజ విరుద్ధమైన భ్రష్టత్వం | 1:28-32 |
| బి) మంచివారి పాపాన్ని గూర్చిన ప్రత్యక్షత (మంచివారు కూడ నీతిమంతులుగా తీర్చబడాలి) | 2:1-16. |

సి) ధర్మశాస్త్రానికి లోనైన ఇశ్రాయేలీయుల పాప ప్రత్యక్షత 2:17-3:8

డి) సార్వత్రిక పాప ప్రత్యక్షత 3:9-20.

1. మనిషి అపరాధిగా తీర్పునొందుట. 3:9-12.

2. పరమవైద్యుడు మానవాళి రోగాన్ని నిర్ధారించుట. 3:13-18.

3. ధర్మశాస్త్రం ఉద్దేశం. 3:19-20.

ఇ) దేవుని నీతి ప్రత్యక్షత. (నీతి అనుగ్రహించబడింది) 3:21-5:11
(దేవుని నీతి నిర్వచించబడింది - దేవుని నీతి అంటే దేవుని స్వభావం కాదు, మనిషి స్వనీతి కాదు).

1. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుటను గూర్చిన వివరణ : 3:21-31.

2. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం ఉదహరించబడుట (4:1-25).
- (అబ్రాహాము మరియు దావీదు)

3. విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట - దాని ఫలితాలు (5:11).

## C. విశ్వాసి శుద్ధీకరణ - 5:12-8:39 :

**అ. శక్తివంతమైన శుద్ధీకరణ - 5:12-21**

ఎ) (ఆదాము మరియు క్రీస్తుల) ఆధిపత్యం.

1. ఆదాము ఆధిపత్యం.(మరణం - పాపం) 5:12-14
2. క్రీస్తు ఆధిపత్యం (జీవం - నీతి) 5:15-17
3. ఆదాము పాపము, మరియు క్రీస్తునీతికి భేటీ. 5:18-21

**ఆ. స్థానమును బట్టి కలిగే శుద్ధీకరణ - 6:1-10**

(యేసు క్రీస్తు మరణపునరుత్థానాలలో ఐక్యపర్చబడుట - పాపం నుండి విడుదలకు ఆధారం).

**ఇ. ఆచరణాత్మకమైన శుద్ధీకరణ. 6:11-33**

(దేవుని పట్ల విధేయత, పాపం నుండి విడిపించబడే అనుభవానికి నడిపిస్తుంది.

**ఈ. శక్తి హీనమైన శుద్ధీకరణ. 7:1-25**

1. రక్షించబడిన ఆత్మ బంధకాలు. 7:1-4
2. రక్షించబడిన ఆత్మ పోరాటం. 7:15-25.
(అంతర్యుద్ధం - పాత స్వభావంలో మంచితనం లేదు. క్రొత్త స్వభావంలో శక్తిలేదు).

ఉ. శుద్ధీకరణను గూర్చి దేవుని నూతన సదుపాయం. 8:1-39.
(శక్తివంతమైన శుద్ధీకరణ)

1. నూతన నియమం - పరిశుద్ధాత్మ × ధర్మశాస్త్రం. 8:1-4.

2. నూతన పోరాటం - పరిశుద్ధాత్మ × శరీరం. 8:5-13.
3. నూతన పురుషుడు, (దేవుని కుమారుడు) - పరిశుద్ధాత్మ × మనిషి ఆత్మ 8:14-17.
4. నూతన సృష్టి-పాత స్వభావం × నూతన స్వభావం, దాస్యం × స్వాతంత్ర్యం 8:18-22.
5. నూతన శరీరం : మూల్గే శరీరం - విమోచించబడిన శరీరం 8:23-27.
(ప్రస్తుత దేహంలో పరిశుద్ధాత్మ సహాయం చేస్తాడు).
6. దేవుని నూతన సంకల్పం : 8:28-34. (దేవుని సంకల్పం పాపుల రక్షణకు హామినిచ్చింది.
7. విశ్వాసి నూతన భద్రత : 8:35-39.
(దేవుని ప్రేమ విశ్వాసి భద్రతకు హామి నిచ్చింది).

## II. దేవుని అనుగ్రహం (నిరీక్షణ) 9-11 అధ్యా :

### A. ఇశ్రాయేలుతో దేవుని పూర్వ వ్యవహారాలు - 9 అధ్యా.

1. ఇశ్రాయేలు వర్ణించబడుట - 9:1-5.
2. ఇశ్రాయేలు గుర్తించబడుట - 9:6-13.
3. దేవుని సర్వాధికార సంకల్పంలో ఇశ్రాయేలు ఎంపిక 9:14-24.
4. దేవుని లేఖన ప్రవచనాలలో అన్యజనుల ఎంపిక 9:25-33.

### B. ఇశ్రాయేలు పట్ల దేవుని ప్రస్తుత సంకల్పం. 10 అధ్యా.

1. ఇశ్రాయేలు ప్రస్తుత స్థితి - తప్పిపోయిన స్థితి. 10:1-4.
2. ఇశ్రాయేలు ప్రస్తుత స్థానం - అన్యజనులలాగే ఉన్నారు. (ఏ బేధము లేదు) 10:5-12.
3. యూదులు మరియు అన్యుల ప్రస్తుత రక్షణ - సువార్త వినాలి విశ్వసించాలి. 10:13-21.

### C. ఇశ్రాయేలు పట్ల దేవుని భవిష్యత్ ప్రణాళిక - శేషము ఒక జాతిగా సమకూర్చబడి విమోచించబడుతుంది. 11 అధ్యా.

1. ఇశ్రాయేలు శేషం రక్షణ పొందుతుంది. 11:1-6.
2. ఇశ్రాయేలు గ్రుడ్డితనం జ్ఞాపకం చేయబడుట. 11:7-12.
3. ఇశ్రాయేలు విస్మరించబడడానికి కారణం - అన్యజనుల రక్షణ 11:13-21.
4. ఇశ్రాయేలు జాతి సమకూర్చబడుట - గొప్ప ఆశీర్వాదం 11:22-32.
5. ఇశ్రాయేలు జాతి సమకూర్చబడుటకు కారణం - 11:33-36.

## III. విధి 12-16 అధ్యా :

### A. దేవుని కుమారునికి పరిచర్య. 12-13 అధ్యా.

1. దేవునితో ప్రస్తుత సంబంధం - (సమర్పించుకొనుట - లోబడుట) 12:1-2.
2. ఆత్మవరాలతో సంబంధం - 12:3-8.

3. సహ విశ్వాసులతో సంబంధం - 12:9-16.
4. అవిశ్వాసులతో సంబంధం - 12:17-21.
5. ప్రభుత్వంతో సంబంధం - 13:1-7.
6. పొరుగువారితో సంబంధం - 13:8-14.

**B. దేవుని కుమారుల ప్రత్యేకత. 14-16 అధ్యా.**

1. బలహీనమైన విశ్వాసులతో సంబంధం - 14:1-15:3.
(క్రైస్తవ సౌశీల్యంలోని 3 నియమాలు)

అ. ఒప్పుదల (14:5); ఆ. మనసాక్షి (14:22); ఇ. శ్రద్ధ (15:1-2).

2. విశ్వాసులుగా, అన్యజనుల మరియు యూదుల సంబంధం (జాతీయ సంబంధం) 15:4-13.
3. రోమీయులతో మరియు అన్యులతో పౌలు సాధారణ సంబంధం 15:14-33.
(సువార్త మరియు అన్యజనులు 15:16).
4. క్రైస్తవులకు ఒకరితో మరొకరికి గల సంబంధం ప్రత్యక్షపరచబడింది. 16:1-27.

**C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :**

## మొదటి భాగం : దేవుని నీతి ప్రత్యక్షపరచబడుట (1-8 అధ్యా).

**I. ఉపోద్ఘాతం :**

**అ. శుభములు :** పత్రిక ఆరంభంలో పౌలు తనను తాను యేసుక్రీస్తు దాసునిగా పరిచయం చేసికొంటున్నాడు. దాసుడు అనే పదానికి వాడబడిన గ్రీకు పదం దూలోస్ అంటే తనపై తనకు ఏ అధికారం లేనివాడని అర్థం. ఒకప్పుడు పాపానికి దాసుడైన పౌలు క్రీస్తుకు దాసుడయ్యాడు. అపొస్తలునిగా ఉండడానికి పిలువడ్డాడు (1:1). అంతమాత్రమే కాదు దేవుని సువార్త నిమిత్తం ప్రత్యేకించబడ్డాడు. సువార్త ద్వారా రక్షించబడ్డాడు. సువార్త నిమిత్తం దేవుణ్ణి సేవించాడు (1:9). సువార్తకోసమే ప్రత్యేకించబడ్డాడు. సువార్త ద్వారా రక్షించబడిన మీరు, సువార్త ద్వారా దేవుణ్ణి సేవిస్తున్నారా? సువార్తకోసం మిమ్మిల్ని ప్రత్యేకించుకున్నారా? అతడు ఎవరిని బట్టి, ఎందునిమిత్తం కృపను, అపొస్తలత్వాన్ని పొందాడో వివరిస్తూ రోమీయులు కూడ యేసుక్రీస్తువారుగా ఉండుటకు పిలువబడ్డారని జ్ఞాపకం చేస్తున్నాడు.

**ఆ) రోమా పట్టణాన్ని గూర్చి పౌలుకు ఉన్న అపేక్ష (1:8-17) :** ఆ కాలంలో రోమా నగరంలో సువార్త విరివిగా ప్రకటించబడింది. రోమా సామ్రాజ్యపు ఆధిపత్యంలో ఉన్న అనేక దేశాల నుండి ప్రజలు ఈ నగరానికి వచ్చేవారు. అక్కడి విశ్వాసులు వారికి సువార్త ప్రకటించినందు వలన వారి విశ్వాసం సర్వలోకానికి ప్రచురం చేయబడింది (1:8). క్రీ.శ. 64 సం॥ నాటికి రోమాలో విశ్వాసుల సమూహాలనేకం ఉన్నాయని చరిత్ర తెలుపుతున్నది. పౌలు,

కొరింథు, ఎఫెసు, థెస్సలొనీక అనే పెద్ద నగరాలలో సంఘ స్థాపన కొరకు, కీలక నగరమైన రోమాలోని సంఘమును గూర్చి అధిక శ్రద్ధ కలిగి ఉన్నాడు. పౌలు ఈ సంఘానికి ఎలా ఋణపడి ఉన్నాడో చెప్పాడు 1:14,15. అతడు సువార్త నిమిత్తం ఋణస్తునిగా ఎంచుకొన్నాడు. దానిని ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నాడు. సువార్తను గూర్చి సిగ్గుపడలేదు.

ఇ) **సువార్త ప్రాముఖ్యత :** సువార్త పాపికి అవసరమైన దానిని, అతడు విశ్వాసంతో పొంద గలిగిన దానిని ప్రత్యక్షపరుస్తుంది. సువార్తలో గొప్ప శక్తి ఉంది. ఒక వ్యక్తిని క్రైస్తవునిగా మార్చగల ఈ దేవుని శక్తి ఎన్నడు తరిగిపోదు. దానిని ఏది ఆపలేదు.

పౌలు తన నూతన జన్మ అనుభవం నుండే రోమీయులతో మాట్లాడుతున్నాడు. దమస్కు మార్గంలో యేసును చూచిన అతడు క్రియలు, జాతి, సౌశీల్యం ఇవేవి మనిషిని రక్షించలేవని, సిలువ వేయబడిన క్రీస్తును విశ్వాసించుట ద్వారానే రక్షించబడగలడని తెలిసికున్నాడు గనుక దానినే ప్రకటించాడు (1:17).

సువార్తలోని వ్యక్తి – క్రీస్తు; సువార్త శక్తి – దేవుని శక్తి; సువార్త ఉద్దేశం – రక్షణ
సువార్త లక్ష్యం–ప్రతి ఒక్కరు; సువార్త ఫలితం–నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవిస్తాడు.

## II. మానపాపం మరియు దేవుని తీర్పు ప్రత్యక్షత :

అ. **అన్యుల అపరాధం (1:18-32) :** దేవుని కోపం భక్తిహీనత మరియు దుర్నీతిపై ఉంటుంది (1:18). పది ఆజ్ఞలలో మొదటి నాలుగు ఆజ్ఞలు, దేవునికి మానవునికి సంబంధించినవి. మిగతా ఆరు మానవునికి ఇతర మానవులకు సంబంధించినవి. భక్తిహీనత అంటే మొదటి నాలుగు ఆజ్ఞలను అతిక్రమించడం అని, దుర్నీతి అంటే మిగతా ఆరు ఆజ్ఞలను మీరడం అని కొంతమంది అభిప్రాయం, అన్యుల అపరాధానికి కారణం 1:18-23లో దాని ఫలితం 1:24-32లో వ్రాయబడింది.

ఆ. **యూదుల అపరాధం (2:1-3:8) :** తమ వద్ద ధర్మశాస్త్రం ఉంది అన్న గర్వంతో, అన్యజనులనే దేవుడు శిక్షిస్తాడనుకొంటున్నయూదులు రక్షకుడైన యేసును తృణీకరించారు. వారికి సత్యాన్ని బట్టి (2:1-5) వారి క్రియలను బట్టి (2:6-10) పక్షపాతము లేకుండ (2:11-16) తీర్పు తీర్చబడుతుంది. ప్రపంచానికి రానైయున్న అంతిమ తీర్పులో దేవుడు అందరికి వారి వారి క్రియల చొప్పున తీర్పు తీరుస్తాడు. యూదులకు ధర్మశాస్త్రం ప్రకారం తీర్పు జరుగుతుంది. అన్యజనులకు అలాంటి తీర్పు ఉండదు. ధర్మశాస్త్రం కలిగి ఉండడం ప్రాముఖ్యం కాదు గాని దానిని అనుసరించి ప్రవర్తించే వారే నీతిమంతులు. యూదులకు ధర్మశాస్త్రం ఉన్నా (2:17-29) దేవోక్తులున్నా (3:1-8) వారు వాటికి లోబడరు. యూదులకున్న ఆధిక్యతలేవి వారిని నీతిమంతులుగా చేయలేదు.

**ఇ. దేవుని యెదుట అందరూ పాపులే 3:9-20 :** ఈ భాగం మానవుని స్వాభావిక స్థితిని జ్ఞాపకం చేస్తుంది. దేవుడు లేని మనిషిని వర్ణిస్తుంది. ఈ వర్ణన ఒక న్యాయసభను గుర్తుచేస్తుంది. ఈలోకానికంతటికి న్యాయకర్తయైన దేవుడు, యూదులను అన్యులను తీర్పుకొరకు పిలుస్తున్నాడు. వారు తాము అపరాధులము కాము అని చెప్పిన ఆరోపణలకు జవాబు చెప్పబడింది. చివరికి అందరిపై మోపబడిన నేరం ఒక్కటే అందరూ పాపం చేసారు. మనిషి తన పాపాన్ని తీసివేసికోలేడు. తన స్వభావాన్ని మార్చుకోలేడు. ధర్మశాస్త్రం పాపం అంటే ఏంటో వివరిస్తుంది (3:20) కాని పాపాన్ని తొలగించి మనిషిని మంచివానిగా మార్చలేదు.

## III. నీతిమంతులుగా తీర్చబడుట 3:21-5:21 :

**అ. నీతిని గూర్చిన వివరణ (3:21-31) :** దేవుడు మనల్ని చూసినపుడు మనలో ఏ నీతి కనిపించదు (3:10) కాని క్రీస్తులో మనల్ని చూసినప్పుడు ఆయన నీతిని బట్టి మనల్ని నీతిమంతులుగా చూస్తాడు. క్రీస్తు నీతి మనకు ఆపాదించబడి అది మననీతిగా పరిగణించబడినపుడే నీతి మంతులుగా తీర్చబడతాము. యేసు క్రీస్తు ఇచ్చే నీతిని మన అర్హతలను బట్టి కాక, విశ్వాసం ద్వారానే పొందగలుగుతాము. మన క్రియలు నశించిపోతాయి, జాతి, మతం మరణం శాపానికి లోనయ్యాయి. మన స్వనీతి మురికి గుడ్డలతో సమానం. క్రీస్తు ద్వారా అనుగ్రహించబడే నీతిని, ఆయన రక్షణ కార్యాన్ని విశ్వసించుట ద్వారానే పొందగలుగుతాము.

**ఆ. నీతిని గూర్చిన ఉదాహరణ (4:1-25) :** అబ్రాహాము విశ్వాసం ద్వారా నీతిని, స్వాస్థ్యాన్ని సంతానాన్ని పొందాడు (4:3, 13,17). అబ్రాహాము నీతి, క్రియలకు, సున్నతికి, ధర్మశాస్త్రానికి అతీతమైనది (4:9-15). అది విశ్వాసమూలమైనది నీతి. (4:16-25).

**ఇ) నీతి వలన కలిగే ప్రయోజనాలు (5:1-11) :** ఈ భాగంలో క్రీస్తు చెల్లించిన వెలను బట్టి కలిగే విమోచన గూర్చి వ్రాయబడింది మన విశ్వాసాన్ని బట్టి రక్షణ ధృవీకరించబడినందు వల్ల మనం తీర్పులోనికి రావడం లేదు. దేవుని కృప ద్వారా నీతిమంతులుగా తీర్చబడినవారు, దేవునితో సమాధానాన్ని (5:1,2) పాపక్షమాపణను, శ్రమలలో ఆనందాన్ని (5:3-8) రక్షణ నిశ్చయతను పొందుతారు. (5:6-11).

క్రీస్తునందు విశ్వాసికి గల శుభప్రదమైన నిరీక్షణ అతణ్ణి భవిష్యత్తు కొరకు సిద్ధపరుస్తుంది. ఈ నిరీక్షణ మనల్ని సిగ్గుపరచదు (5:5). దేవుని ప్రేమ పరిశుద్ధాత్మ ద్వారా మన హృదయాలలో క్రుమ్మరించబడుతుంది. ముఖ్యంగా ఈ భాగంలో మానవుని స్థితి ఎలా వుందో వర్ణించబడింది (5:6-10) నీతిగా బ్రతకాలని మనిషి ఆశించినా, పాపనైజం నీతిని అడ్డుకొంటుంది. ఎంత గొప్పవాడైనా, బలవంతుడైనా పాప ప్రభావానికి లోనైన వ్యక్తి బలహీనుడే, తన పాపాన్ని బట్టి దేవునికి శత్రువయ్యాడు.

**ఈ) నీతికి, శిక్షావిధికిగల వ్యత్యాసము (5:12-21) :** ఈ భాగంలో ఇద్దరు ఆదాములను గూర్చి వ్రాయబడింది. వారిద్దరికి గల వ్యత్యాసం వారి క్రియలను బట్టి కలిగిన భిన్న ఫలితాలను గూర్చి వివరింపబడింది. మొదటి ఆదాము వలన పాపము, దాని ఫలితమైన మరణం మానవులందరికి ఎలా ఆపాదించబడిందో అలాగే రెండవ ఆదామైన యేసు నీతి, ఆయనను విశ్వసించిన వారందరికీ ఆపాదించబడింది. తద్వారా వారు దేవునితో సమాధానపర్చబడతారు.

**IV. పరిశుద్ధ పరచబడుట : దేవుని నీతి ప్రత్యక్షపరచబడుట, 6:1-8:39**

**A. శుద్ధీకరణ మరియు పాపము : 6:1-23.**

1. **నియమమును బట్టి విశ్వాసి పాపము కొరకు మరణించుట, 6:1-14 :** మనకు ఊహ తెలియనప్పటి నుండే పాపము అనే నియమం మనల్ని పరిపాలిస్తున్నది. 6వ అధ్యాయంలో యేసు ప్రభువును అంగీకరించినవారి మీద పాపంగాని, సాతానుగాని ప్రభుత్వం చేయలేవని పౌలు విశదపరుస్తున్నాడు. ఈ అధ్యాయం క్రీస్తులో విశ్వాసి స్థితిని జ్ఞాపకం చేస్తున్నది. దానిని బాప్తిస్మము ద్వారా వివరించాడు. బాప్తిస్మము క్రీస్తు మరణం, భూస్థాపన మరియు పునరుత్థానములలో విశ్వాసి ఐక్యతను సూచిస్తున్నది. దేవుని శిక్షకు పాత్రులుగా ఉన్న మనము క్రీస్తునందు విశ్వాసముంచినపుడే పాత స్వభావం కొరకు మరణిస్తాము. అయితే ఆ నియమం మన శరీరాన్ని ఉపయోగించుకొని మనలో ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది. దానిని జయిస్తూ పరిశుద్ధతను కాపాడుకోవాలి. నీతిమంతులుగా తీర్చబడడం అన్నది ఒక్క సారే జరుగుతుంది, కాని పరిశుద్ధపరచబడడం అన్నది జీవితాంతం వరకు కొనసాగే ప్రక్రియ. ఈ పరిశుద్ధతనే పాపపు శక్తిని జయిస్తుంది. పాపప్రభావం నశించినప్పుడు మనం దాని ఆధిపత్యంలో ఉండము గనుక పాపం మన జీవితాల్ని ఏలదు.
2. **ఆచరణలో విశ్వాసి పాపం కొరకు మరణించుట (6:15-30) :** విశ్వాసి పాపమునకు దాసుడు కాకుండ జీవించాలి అంటే నీతికి దాసుడు కావాలి. దేవుని కృప ఉందని పాపం చెయ్యడానికి వీలులేదు సుమా! విశ్వాసి జీవితం క్రియాపూర్వకమైనదై యుండాలి. ఒకప్పుడు అపవిత్రతకు, అక్రమమునకు అప్పగించిన మన అవయవాలను నీతికి అప్పగించాలి. పాపానికి దాసులుగా ఉన్నప్పటి క్రియల ఫలితం మరణమే. అవి అవమానకరమైన క్రియలు. కాని ఇప్పటి క్రియల ఫలం పరిశుద్ధత, దాని అంతము నిత్యజీవము.

**B. శుద్ధీకరణ మరియు పాపము 6:1-23.**

రక్షించబడిన ఆత్మ ప్రతి బంధకం మరియు విశ్వాసి పోరాటం గూర్చి 7వ అధ్యాయంలో వివాహమును గూర్చిన ఉదాహరణతో చిత్రీకరించబడింది.

1. **ధర్మశాస్త్రము నుండి విడుదల పొందుట - దేవునికి కొరకు జీవించుట (7:1-6) :** పాత పురుషుడైన ఆదాము నుండి విడుదల పొందిన విశ్వాసికి ధర్మశాస్త్రమనే పురుషుని ద్వారా

ఇబ్బంది కలుగుతున్నది. మరణించిన వారిపై ధర్మశాస్త్రానికి ఏ అధికారం లేదు. ఆలాగే క్రీస్తుతో కూడ చనిపోయన అనుభవంలోనికి వచ్చిన విశ్వాసి ధర్మశాస్త్రం నుండి విడుదల, దేవునితో నూతన సబంధం కొరకైన స్వేచ్ఛను పొందాడు.

2. **ధర్మశాస్త్రము పాపము నుండి విడిపించలేదు (7:7-25) :** ఈ భాగంలో రెండు ఆధ్యాత్మిక నియమాలున్నాయి. మొదటిది దేవుని నియమం. అనగా ధర్మశాస్త్రం. అది లిఖిత పూర్వక దేవుని నీతి ప్రమాణము. రెండవది పాప నియమం, ఇది దేవుని ధర్మశాస్త్రం ద్వారానే తెలియజేయబడుతుంది. పాపనియమంలో ఆధ్యాత్మికంగా అధోగతికి లాగే గురుత్వాకర్షణ శక్తి ఉంది. ఈ రెండింటి మధ్య జరిగే నిరంతర పోరాటంలో నలిగిపోయిన పౌలు తన జీవిత అనుభవంలో నుండి ధర్మశాస్త్రమును గూర్చి మూడు విషయాలు వ్రాసాడు. మొదటిగా, ధర్మశాస్త్రం పాపం అంటే ఏంటో తెలియజేస్తుంది (7:7). రెండవదిగా దురాశలను వృద్ధి చేస్తుంది (7:8). మూడవదిగా పాపాన్ని గూర్చి తీర్పు తీరుస్తుంది (7:13). ఈ అనుభవం ప్రభువును అంగీకరించిన వారందరికి ఉంటుంది. అయితే ప్రభువు మనల్ని చెడు నుండి, పాపం నుండి విడిపిస్తాడు.

**C. శుద్ధీకరణ మరియు పరిశుద్ధాత్మ (8:1-39) :**

1. **పరిశుద్ధాత్మ ద్వారా శరీరం యొక్క శక్తి నుండి విడిపించబడుట (8:1-11) :** ఈ భాగంలో పౌలు మరి రెండు ఆధ్యాత్మిక నియమాలను గూర్చి వ్రాస్తున్నాడు. మొదటిది యేసుక్రీస్తు నందు జీవమునిచ్చే ఆత్మ నియమము. పాపనియమ శక్తి నుండి విడిపించగల శక్తి ఈ నియమములో ఉంది. రోమా 8:5-7 లో పౌలు మరో ఆధ్యాత్మిక నియమాన్ని అనగా మనస్సు లేక చిత్త వృత్తిని గూర్చిన నియమాన్ని గూర్చి వ్రాసాడు. ఈ మూడు వచనాల్లోనే 'మనస్సు' అనే మాట 5 సార్లు ప్రస్తావించబడింది. మనం పాప మరణ నియమము ద్వారా నడిపించబడుతన్నామా? లేక మన మనస్సు లేక చిత్త వృత్తి తీర్మానంపై మన నిర్ణయం ఆధారపడి ఉంటుంది. క్రీస్తునందు జీవాన్నిచ్చే ఆత్మనియమం ద్వారా నడిపించ బడుతున్నామా?

8వ అధ్యాయం నీతిమంతులుగా తీర్చబడుటలోని మూడు విషయాలను వివరిస్తుంది.

అ) యేసు క్రీస్తు మరణ పునరుత్థానాలను విశ్వసించిన వారికి ఇక ఏ శిక్షావిధి లేదు (8:1).

ఆ) పరిశుద్ధాత్మ పాపము యొక్క శక్తి పై విజయాన్నిస్తాడు (8:2).

ఇ) దేవుని దృష్టిలో ఇక పాపము గాని దాని పరిణామాలుగాని కనిపించవు.

2. **పరిశుద్ధాత్మ ద్వారా కుమారత్వాన్ని పొందుట (8:12-17) :** ఈ భాగంలో పౌలు క్రీస్తులో విశ్వాసికి గల వారసత్వాన్ని గూర్చి వివరిస్తున్నాడు. దేవుని పిల్లలుగా మన హక్కును గూర్చి (8:16). కుమారులుగా మనకున్న ఆధికృతను గూర్చి (8:14,15) వ్రాయబడింది. సాధారణంగా పిల్లలు యుక్త వయస్సు వచ్చాక వారసులౌతారు. ఆధ్యాత్మికంగా దత్త

పుత్రులమైన మనము దేవుని కుమారుడైన యేసు క్రీస్తుతోపాటు అన్నిటిలో సమాన వారసులము. దత్తపుత్రాత్మ అన్న మాట బైబిలులో 4 సార్లు వ్రాయబడింది. (రోమా 8:15, 23; 9:4; గలతీ 4:5).

3. **పరిశుద్ధాత్మ భవిష్యత్ మహిమను గూర్చిన నిశ్చయతనిస్తాడు (8:18-30) :** మనిషి పాప ఫలితానికి ఈ సృష్టి ఎలా లోనైందో (ఆది 3:17,18). అలాగే క్రీస్తు ద్వారా కలిగిన విమోచన ఫలితాన్ని కూడ పంచుకొంటుంది. రాబోయే మహిమలో కూడ పాలు పంచుకొంటుంది. (యెష 11:6-9; 35:1-10). ఆ సమయంలో మహిమ శరీరాలతో లేపబడిన దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి ఎదురుచూస్తుందని పౌలు వ్రాసాడు. (8:20,21).

4. **పరిశుద్ధాత్మ అంతిమ విజయాన్ని గూర్చి నిశ్చయత నిస్తాడు (8:31-39) :** దేవుని సంకల్పం పాపుల రక్షణకు హామినిచ్చింది. ఆయన ప్రేమ విశ్వాసి భద్రతకు హామి నిచ్చింది. దేవుడు మన పక్షంగా ఉండగా మనకు విరోధులుండరు. మనపై నేరారోపణ చేసే వారుండరు. ఆయన ప్రేమ నుండి మనల్ని ఎవరూ ఎడబాపలేరు. ఈ భూమ్మీద గాని, పరలోకంలోగాని మనల్ని ఓడించేవారెవరు లేరు. మరణం, జీవం, దేవ దూతలు ప్రధానులైనను అధికారులైనను, ఉన్నవైనను రాబోవునవైనను, ఎత్తైనను, లోతైనను మనపై జయాన్ని పొందలేవు. వ్యక్తిగతంగాను, సంఘముగాను క్రీస్తు మనతో ఉండగా ఆయన ప్రేమ నుండి ఏదేగాని మనల్ని వేరు చేయలేవు.

## రెండవ భాగం : దేవుని నీతి ఆరోపించబడుట (9-11 అధ్యా)

### I. ఇశ్రాయేలు గత స్థితి : దేవుని ఎన్నిక 9:1-29.

రోమా పత్రికలోని ఈ మూడు అధ్యాయాలు బైబిలంతటిలో చాలా ప్రాముఖ్యమైనవి. అందులో 9:1-29 వరకు దేవుని ముందు నిర్ణయం, లేక ఏర్పాటు కనిపిస్తుంది. మొదటి ఐదు వచనాల్లో పౌలుకు తన స్వజనుల పట్లగల మనోవేదనను గమనించగలం. ఈ ప్రపంచంలోని ప్రజలందరికన్న, యూదులకు ప్రత్యేక ఆధ్యాత్మిక చరిత్ర ఉన్నా క్రీస్తును అంగీకరించని వారి భవిష్యత్తు ఆయనను అంగీకరించని అన్యులతో సమానం. 9:6-13 వచనాల్లో పౌలు దేవుని సార్వభౌమత్వాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. అబ్రాహాముకు హాగరు వలన కలిగిన కుమారుడు, శారా వలన కలిగిన కుమారుడు కూడ ఇహలోక సంపదతో ఆశీర్వదించ బడ్డారు. అయితే యేసు ప్రభువును రక్షకునిగా అంగీకరించని ఇష్మాయేలు సంతానం శరీర సంబంధులుగానే ఎంచబడ్డారు. ఆత్మసంబంధియైన ఇస్సాకు కుమారుడైన ఏశావు కూడ ఒక్క పూట కూటి కోసం తన జేష్ఠత్వాన్ని అమ్ముకొని దేవుని సార్వభౌమత్వాన్ని తృణీకరించాడు. దేవుని సార్వభౌమత్వాన్ని అంగీకరించినవారే తప్ప మత సాంప్రదాయాలను అనుసరించేవారు ఆయన ప్రజలు కారని ఈ భాగం స్పష్టం చేస్తుంది. ఏశావును దేవుడు

ద్వేషించి ఉంటే అతనికి జేష్ఠత్వపు హక్కును ఇచ్చేవాడు కాదు. దేవుడు అన్యాయస్తుడుకాదు. ప్రతి ఒక్కరి ప్రవర్తన విషయం వారికే స్వేచ్ఛనిస్తాడు. దేవుని ప్రేమ ద్వారా క్రీస్తులో దొరికే కనికరం మనకందరికి అందుబాటులో ఉంది. అందుకు మనం పాత్రులము కావాలి (9:18). దేవుడు మనిషి చిత్తాన్ని వ్యతిరేకించడు కాని దేవుని చిత్తాన్ని నిరాకరించినవారిని వారి స్వంత చిత్తానికి అప్పగిస్తాడు. దేవుడు వారి హృదయాన్ని కఠినపర్చడు. వారే కఠిన పరచుకొంటారు.

దేవుని సార్వభౌమత్వాన్ని అనేకులు వ్యతిరేకిస్తున్నప్పటికిని, ఆయన వారి పట్ల ఇంకా దీర్ఘశాంతము చూపిస్తున్నాడు. యేసు ప్రభువును అంగీకరించని ఇశ్రాయేలు ప్రజలు దేవుని ఉగ్రతకు పాత్రులు. అందుకు కారకులు వారే. (మత్త 27:25). 9:25 లో పౌలు ఇశ్రాయేలీయులను గూర్చి హోషెయా ప్రవక్త వ్రాసిన మాటలను జ్ఞాపకం చేస్తున్నాడు. 26వ వచనంలో ప్రభువును అంగీకరించిన మరియు అంగీకరించబోయే అన్యజనులను గూర్చి వ్రాయబడింది. 28, 29 వచనాలలోని యెషయా ప్రవచనం, మహా శ్రమల కాలంలో 1,44,000 మంది యూదులు రక్షణ పొందుట ద్వారా నెరవేరబోతుంది.

**II. ఇశ్రాయేలు గత స్థితి : దేవుడు వారిని తృణీకరించుట (9:30-10:21)**

ఈ భాగంలో తమ క్రియల ద్వారా నీతిని పొందాలన్న ఇశ్రాయేలు ప్రయత్నం (9:30-33) వారు క్రీస్తును తృణికరించుట (10:1-5) ప్రవక్తలను తృణీకరించుట (10:16-21) ను గూర్చి వ్రాయబడింది.

దేవుడు ఇశ్రాయేలు ప్రజలను తన స్వకీయజనాంగముగా ఏర్పాటు చేసికొన్నాడు. ధర్మశాస్త్రం ద్వారా ఆయన నీతిని బయలుపర్చాడు కాని యూదులు మతపరమైన ఆచారాలతో నీతిని పొందవచ్చునని భ్రమించారు. వారి మతాచారాలకు యేసు ప్రభువు అడ్డుబండగా మారాడు. (9:33). వారికి మతం పట్ల తీవ్రమైన ఆసక్తి ఉంది కాని అది జ్ఞానానుసారమైనదికాదు (10:1-3). 10:6-8 లో ఇశ్రాయేలీయులు ప్రభువును తృణీకరించిన విధానం, 10:16-21 లో సువార్తను తృణీకరించిన విధానం వ్రాయబడింది. ఈ సందర్భంగా పౌలు యెషయా 53:1 లోని మాటలను జ్ఞాపకం చేస్తున్నాడు (10:16).

**III.ఇశ్రాయేలు భవిష్యత్తు : దేవునిచే సమకూర్చబడుట (11:1-36) :**

దేవుడు ఇశ్రాయేలును తృణీకరించాడు, కాని ఆ తిరస్కారం సంపూర్ణమైనది కాదు (11:1-10) ఆయన తన కోసం శేషాన్ని ఎప్పుడూ నిలిపి ఉంచాడు (11:5). ఆలాగే మనం గమనించాల్సిన మరో విషయం ఏమంటే దేవుని తిరస్కారం శాశ్వతమైనది కాదు (11:11-24). అది ఇశ్రాయేలు చరిత్రకు ముగింపుకాదు. యూదుల తొట్రుపాటు నిరీక్షణ లేనంత ప్రమాదకరమైనది కాదు. అది తాత్కాలికమైనది.. యూదుల తొట్రుపాటు అన్యజనుల రక్షణార్థం మేలుగా మారింది. యూదులలో ప్రారంభమైన రక్షణ సువార్త అన్యజనులకు

మేలు కలిగిస్తూ ఉండగా యూదులు రోషం గలిగి యేసు ప్రభువును అంగీకరిస్తారని పౌలు చెప్తున్నాడు. ఇందులో వారి రక్షణ కొరకు పౌలు ఎంత తాపత్రయపడుతున్నాడో తెలుస్తుంది. (11:13-15).

ప్రభువును నమ్మిన అన్యజనులమైన మనం అంటు కట్టబడిన కొమ్మలం. కాబట్టి సాధారణ కొమ్మలైన యూదుల కంటె గొప్పవారమని, లేక దేవుడు వారిని ప్రక్కన పెట్టాడని మనం వారిని నిర్లక్ష్యం చేయకూడదు. అతిశయించకూడదు. వారి క్షేమం కొరకు ప్రార్థించాలి. (కీర్త 122:6) ఈ భాగంలో ఇశ్రాయేలు తృణీకరించబడడంలోని ఉద్దేశం (11:11-24) ఆలాగే సమకూర్చబడుటలోని ఉద్దేశం (11:25-32) స్పష్టంగా వ్రాయబడింది.

అన్యజనుల సంఖ్య పూర్తి అయ్యేంత వరకు, అనగా క్రీస్తును అంగీకరించిన సంఘము మధ్యాకాశానికి ఎత్తబడేంత వరకు మాత్రమే యూదులకు కఠిన మనస్సు ఉంటుంది. తరువాత అనగా 7 సంవత్సరాల శ్రమల్లో యూదుల రక్షణ కాలం ప్రారంభంకానున్నది. అది ఇశ్రాయేలీయులకు కృపాకాలము (జెక 12:10-13-1).

దేవుని బుద్ధి జ్ఞానములు మన ఊహకందనివి. ఆయన కార్యాలను, మార్గాలను పరిశుద్ధాత్మ శక్తి ద్వారానే గ్రహించగలం గాని మానవ మేధస్సుకు అవి అంతుపట్టవు.

## మూడవ భాగం : దేవుని నీతి అన్వయించుకొనుట (12-1-16:27)

### I. దేవుని నీతి క్రైస్తవ విధులలో ప్రత్యక్షపర్చబడుతుంది (12:1-13:14) :

ఈ భాగంలో విశ్వాసికి దేవుని పట్ల గల బాధ్యతలు (12:1,2) సమాజం పట్ల గల బాధ్యతలు (12:3-21) పై అధికారుల పట్ల గల బాధ్యతలు (13:1-7) పొరుగువారి పట్ల గల బాధ్యతలు (13:8-14) వివరించబడ్డాయి.

రక్షించబడిన ప్రతి ఒక్కరు తమ స్వంత చిత్తాన్ని చంపుకొని పాపం విషయం అనుదినం చనిపోతూ దేవుని చిత్తానికి సంపూర్ణ విధేయత చూపిస్తూ, పరిశుద్ధమైన దేవునికి అనుకూలమైన అర్పణగా మన జీవితాన్ని సమర్పించాలి. (గల 5:26; రోమా 6:12,13) అదే సజీవయాగం. విశ్వాసులు ఈ లోకంలోనే జీవించాలి గాని లోకమర్యాదల నుండి ప్రత్యేకంగా జీవించాలి, క్రీస్తు పోలికలోనికి మార్చబడాలి. (ఎఫె 4:22,23). క్రీస్తు శరీరమైన సంఘంలో సభ్యులుగా ప్రతి ఒక్కరూ వారికివ్వబడిన కృపావరాలను తెలిసికొని, క్రీస్తులో తమ స్థానాన్ని గుర్తించి సంఘ క్షేమాభివృద్ధి కోసం పాటుపడాలి. విశ్వాసులతో, అవిశ్వాసులతో సరైన సంబంధం కలిగి ఉండాలి. (12:17-21). ఉద్యోగాలు చేస్తున్న చోట పై అధికారులకు లోబడ్డం వలన తమకు దేవుని పట్లగల విధేయతను లోకానికి ప్రత్యక్షపర్చాలి (13:1-6). అయితే దేవునితో మన సంబంధానికి భంగం కలిగించేవాటి విషయంలో వారికి లోబడక, వాక్యానికే లోబడాలి.

## II. దేవుని నీతి క్రైస్తవ స్వాతంత్ర్యములో ప్రత్యక్షపర్చబడుతుంది (14:1-15:13) :

ప్రప్రథమంగా ఈ భాగంలో క్రైస్తవ స్వాతంత్రంలోని నియమాలేంటో చూద్దాం. రోమాలో ఉన్న సంఘంలోని విశ్వాసులలో యూదులు మరియు అన్యులు కూడ ఉన్నారు. వారిలో కొందరు బలహీనమైన మనస్సాక్షిగలవారు గనుక భోజన పానాదుల విషయంలో ఎవరేగాని ఇతరులకు తీర్పుతీర్చవద్దని పౌలు వ్రాస్తున్నాడు. (14:1-3) ఆలాగే దినాలను గూర్చి కూడ పలు అభిప్రాయాలున్నా, దేవునిచే అనుగ్రహించబడిన దినాలను ఎలా సద్వినియోగం చేసికొంటున్నామన్నదే ముఖ్యం. ప్రతి దినాన్ని బట్టి దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. మనం బ్రతికినా, చనిపోయినా క్రీస్తువారము గనుక, దినాన్ని లక్ష్య పెట్టినా, భోజనం చేసినా ప్రభువు కొరకే చెయ్యాలి. (14:5-7) మనందరం ఒక దినాన దేవుని న్యాయ పీఠం ఎదుట నిలబడాలి గనుక ప్రతి ఒక్కరూ స్వపరీక్ష చేసికోవాలి. (14:9-13) 14:14-23 లో ప్రేమ నియమం కనిపిస్తుంది. యేసు ప్రభువు బలమైన మనస్సాక్షిగలవారి కొరకు మరియు బలహీనమైన మనస్సాక్షి గలవారి కోసం కూడ చనిపోయాడు. కాబట్టి విశ్వాసుల మధ్య హెచ్చు తగ్గులు లేకుండ వారి ఆత్మీయ అభివృద్ధి కొరకే ప్రయాసపడాలి. దేవుని రాజ్యం అంటే భోజన పానాదులు కాదు. రక్షణ ద్వారా కలిగే నీతి, సమాధానం, పరిశుద్ధాత్మయందలి ఆనందం విలువైనవి. అవి పరస్పర ప్రేమలో వ్యక్తం చేయబడాలి.

ఈ భాగంలోని రెండవ విషయం, క్రైస్తవ స్వాతంత్రం గూర్చిన ఆచరణాత్మక విషయాలు 15:1-13 లో వ్రాయబడ్డాయి. విశ్వాసులు ఒకరి భారాన్ని మరొకరు భరించాలి (15:1-6) తద్వారా క్రీస్తు నియమాన్ని పూర్తిగా నెరవేర్చాలి (గల 6:2) తనను తాను సంతోషపరకోకుండ ఇతరుల సంతోషం కోసమే సమర్పించు కొన్న ప్రభువు ఈ విషయంలో మనకు మాదిరిగా ఉన్నాడు. 15:7-13 లోని నిరీక్షణ అంతిమ విముక్తిని గూర్చినది. క్రీస్తుకు విధేయులైన వారందరికి ఈ రెండు వాగ్దానం చేయబడ్డాయి.

## III. ముగింపు (15:14-16:27) :

1. పత్రిక వ్రాయుటలో పౌలు ఉద్దేశం 15:14-21లో వ్రాయబడింది. పౌలు అన్యజనుల రక్షణ కొరకు దేవుని చేత ప్రత్యేకంగా పిలువబడ్డాడు. ఈ విషయాన్నే 15:16 లో చెప్పూ 17వ వచనంలో తన అతిశయానికి కారణాన్ని వివరిస్తున్నాడు. పౌలు తనకున్న ఏ అర్హతను బట్టి గర్వించలేదుగాని, పరిశుద్ధాత్మ ద్వారా దేవుడు తన చేత జరిగించిన సువార్త ప్రకటనను బట్టి మహత్కార్యాలను బట్టి అతిశయిస్తున్నాడు. 15:20-21లో సువార్త ప్రకటన ఎక్కడి నుండి ఆరంభమైందో తెలియజేసాడు. పౌలు రోమా పత్రిక వ్రాసేనాటికి ఇటలీ ప్రక్కన ఇల్లూరికు రాష్ట్రం వరకు సువార్త వ్యాపించింది. సేవకులు గమనించాల్సిన విషయం ఏమంటే, పరిశుద్ధాత్మ వెళ్ళమన్న చోటికి వెళ్ళి సేవచెయ్యాలి. క్రీస్తునామం ఎరుగనివారి మధ్యకు వెళ్ళాలి.

2. పౌలు ప్రయాణ ప్రణాళిక (15:22,23) : ఇల్లూరికు ప్రాంతంలో సువార్త ప్రకటన ముగిసాక, పౌలు రోమా పట్టణానికి వెళ్ళవచ్చును. కాని అక్కడ సంఘం ఉంది, విశ్వాసులు ఎదుగుతూ ఉన్నారు గనుక రోమాకు పశ్చిమ దిశలో నున్న స్పెయిన్ దేశంలో సువార్త ప్రకటించాలన్న ప్రణాళికను కలిగి ఉన్నాడు. అయితే అతడు అక్కడికి వెళ్ళాడో లేదో సరైన వాక్యాధారాలు లేవు. సాంప్రదాయ సమాచారం మేరకు పౌలు స్పెయిన్‌కు వెళ్ళి సువార్త ప్రకటించినట్లు తెలుస్తుంది.

3. పౌలు అభినందనలు, శుభములు (16:1-27) : పౌలు ఈ పత్రికను ఫీబే అనే పరిచారకురాలి ద్వారా రోములో ఉన్న సంఘానికి పంపించాడు. ఈ అధ్యాయమంతా పౌలు, తనతో పాటు పరిచర్యలో పాలు పంపులు పొందిన వారందర్ని అభినందిస్తున్నాడు. వీరందరు ప్రభువు కొరకు బహుగా ప్రయాస పడ్డారు. చివరిలో పౌలు దుర్బోధలను గూర్చి హెచ్చరిస్తున్నాడు (16:17-20). బైబిలులోని సత్యానికి భిన్నమైన ఈ బోధలు ప్రజలలో భేదాభిప్రాయాలను కలిగిస్తాయి. అలాంటి వారిని దైవజ్ఞానంతో కనిపెట్టి వారికి దూరంగా పారిపోవాలి. బ్రతుకు తెరువుకోసం, పేరు ప్రఖ్యాతుల కోసం సేవ చేసేవారు దేవుని దాసులు కారు (16:18). ముగింపులో పౌలు దేవుణ్ణి స్తుతిస్తున్నాడు (16:24-27). పౌలు సేవ ద్వారా లభించిన అపరిమితమైన ఫలితం మరెవరి ద్వారా లభించలేదని చెప్పవచ్చు. అతని జీవితాన్నే గురిగా పెట్టుకొని, క్రీస్తు నామమెరుగని ప్రాంతాలను చేరుటలో మనందరం ప్రయాస పడుదాం. దైవాశీస్సులు.

---


**రోమా పత్రిక ఆడియో సి.డి.**

ట్రాన్స్ వరల్డ్ రేడియో ద్వారా ప్రసారం చేయబడిన **"ప్రేమధార"** రేడియో కార్యక్రమంలో ఆచార్య ఆరార్కే మూర్తిగారు రోమా పత్రికపై అందించిన 36 వర్తమానములు గల MP-3 ఆడియో సి.డి. మరియు ఇతర గ్రంథాల MP-3 ఆడియో సి.డి.లు లభ్యమౌతాయి. వివరాలకు మాకు వ్రాయండి లేదా ఫోను ద్వారా సంప్రదించండి.

**ఫోన్ : 9399952570, 9399952580.**



**TTB - Telugu - Study Outlines - The book of Romans**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to : **www.radio882.com**